వార్త, హైదరాబాద్, సోమవారం 28, జూలై 2025

# మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తగా ఇంజినీరింగ్ కాలేజీ

## 4 కోర్సుల్లో అడ్మిషన్లకు అనుమతి..

## రూ. 46.20 లక్షల నిధులు మంజూరు

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరో కొత్త ఇంజనీరింగ్ కాలేజీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. మహబూబ్ నగర్ జిల్లా సలీంనగర్‌లో కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా జారీ చేశారు. మహబూబ్ నగర్ జిల్లా, ధర్మాపూర్, సలీమ్ నగర్‌లో జికె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పేరుతో కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నట్టు జివో ఆర్‌టి నంబర్ 109ని జారీ చేశారు. ఈ విద్యా సంవత్సరం 2025-26 నుంచే 4 ఇంజనీరింగ్ కోర్సులను ప్రారంభించాలని నిర్ణయించారు. బి టెక్‌లో ఏఐ అండ్ ఎంఎల్, సిఎస్ఈ, కంప్యూటర్‌సైన్స్ అండ్ ఐటీ, బిటెక్-ఐటీలో ఒక్కో కోర్సులో 60 సీట్ల చొప్పున అడ్మిషన్లను తీసుకోనున్నారు. మహబూబ్‌నగర్‌లో కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసిటిఈ) అనుమతి ఇవ్వడంతో జెఎన్‌టియు హైదరాబాద్ కూడా కాలేజీ ఏర్పాటుకు అనుమతించడంతో కొత్త ఇంజనీరింగ్ కాలేజీని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి వివిధ అవసరాల కోసం రూ. 46.20 లక్షలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులో స్పష్టం చేసింది. ప్రస్తుతం జరుగుతున్న ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగానే అడ్మిషన్లను తీసుకోనున్నారు.

సోమవారం । 28 । జూలై । 2025
హైదరాబాద్ । www.sakshi.com

# కంప్యూటర్స్‌పై కోటి ఆశలు



## కన్వీనర్ కోటా కింద తాజాగా పెరిగిన 5,549 సీట్లు

- తొలి విడత ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో మిగిలిన 13,944 సీట్లు
- రెండో విడతకు అందుబాటులో మొత్తం 19,493 కంప్యూటర్ బ్రాంచీల సీట్లు
- 6 వేలకు పైన ర్యాంకు వచ్చినా సీటు వస్తుందనే అంచనా
- ఆయా బ్రాంచీల్లో సీటు కోసం భారీయెత్తున విద్యార్థుల ఆప్షన్లు
- 95 వేల మంది విద్యార్థులు... అన్నీ కలిపి 27 లక్షల ఆప్షన్లు
- 30న ఇంజనీరింగ్ రెండో విడత సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్

కంప్యూటర్ సైన్స్ సీట్లు పెరగడంతో రెండో దశ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో ఆ బ్రాంచిపై విద్యార్థుల ఆశలు పెరిగాయి. ఈసారి కంప్యూటర్ సీటు వస్తుందని భావిస్తున్నారు. తొలివిడతలో ఇతర బ్రాంచీల్లో సీట్లు వచ్చిన వాళ్లూ ఆప్షన్లు మార్చుకున్నారు. తొలి ప్రాధాన్యతగా సీఎస్ఈ, ఎమర్జింగ్ కోర్సులను ఎంచుకున్నారు. వెబ్ ఆప్షన్ల గడువు ఆదివారం ముగిసేనాటికి 95 వేల మంది 27 లక్షల ఆప్షన్లు ఇచ్చినట్టు ఎప్‌సెట్ క్యాంప్ కార్యాలయం అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 30న రెండో విడత సీట్ల కేటాయింపు ఉంటుంది.

### పెరిగిన సీట్లన్నీ ప్రైవేటు కాలేజీల్లోనే..

తొలిదశ కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటా కింద కంప్యూటర్ సైన్స్, ఇతర ఎమర్జింగ్ బ్రాంచీల్లో 58,742 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 57,042 సీట్లు కేటాయించారు. అయితే 44,798 మంది మాత్రమే రిపోర్టు చేశారు. దీంతో 13,944 సీట్లు మిగిలిపోయాయి. తాజాగా కన్వీనర్ కోటా కింద కంప్యూటర్ సైన్స్ సీట్లు 5,549 పెరిగాయి. దీంతో మొత్తం 19,493 కంప్యూటర్ సంబంధిత బ్రాంచీల సీట్లు రెండో విడత కౌన్సెలింగ్‌లో అందుబాటులోకి వస్తాయి. పెరిగిన సీట్లన్నీ ప్రైవేటు కాలేజీల్లోనే ఉన్నాయి. టాప్ కాలేజీల్లో తొలి దశ కేటాయింపులో గరిష్టంగా 5 వేల ర్యాంకు వరకూ సీట్లు వచ్చాయి. రెండోదశలో 6 వేలపైన ర్యాంకుకు కూడా సీటు రావచ్చని ఎప్‌సెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీలకు 25 వేల ర్యాంకు వరకూ టాప్ కాలేజీల్లో సీట్లు వస్తాయని చెబుతున్నారు.

### భారీగా కాలేజీలు, ఆప్షన్ల మార్పు

సివిల్, ఈఈఈ, మెకానికల్ వంటి కోర్ గ్రూపుల్లో సీట్లు వచ్చిన విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్‌లో కాలేజీల మార్పుపై ఎక్కువగా దృష్టి పెట్టారు. ఇప్పుడు వచ్చిన కాలేజీ కన్నా, బెస్ట్ కాలేజీలకు తొలి ప్రాధాన్యత ఇచ్చారు. ఈ క్రమంలో 78 శాతం విద్యార్థులు బ్రాంచీ మార్పుకు ఆప్షన్లు ఇచ్చారు. సివిల్‌లో సీటు వచ్చిన విద్యార్థులు టాప్ 30 కాలేజీల్లోనైనా కంప్యూటర్స్ లేదా ఎలక్ట్రానిక్స్‌లో సీటు వస్తుందేమోనన్న ఆశతో ఆప్షన్లు ఇచ్చారు. మరోవైపు టాప్ కాలేజీల్లో సీట్లు వచ్చిన వాళ్ళు కూడా ఆప్షన్లలో కాలేజీ మార్చుకున్నారు. అయితే ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌ల్లో కంప్యూటర్ సీట్లు వచ్చిన విద్యార్థులు మాత్రం

మిగతా 3వ పేజీలో ▶

## కంప్యూటర్స్‌పై కోటి ఆశలు

▶ మొదటి పేజీ తరువాయి

ఆప్షన్లు పెద్దగా మార్చుకోలేదు. అయితే వర్సిటీల్లో సివిల్, ఈఈఈ వంటి కోర్ గ్రూపుల్లో సీట్లు వచ్చిన చాలామంది ప్రైవేటు కాలేజీల్లో ఎమర్జింగ్ గ్రూపుల్లో సీట్ల కోసం ఆప్షన్లు ఇచ్చారు. కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా కలిపి మొదటి విడత కౌన్సెలింగ్ నాటికి 1,07,444 సీట్లు ఉంటే, రెండో విడత నాటికి కంప్యూటర్ బ్రాంచీలతో పాటు కోర్ గ్రూపుల్లో పెరిగిన 9,433 సీట్లను పరిగణనలోకి తీసుకుంటే ఇంజనీరింగ్‌లో మొత్తం 1,16,877 సీట్లు ఉన్నట్టయింది.

ఈనాడు సోమవారం జులై 28, 2025

# కొత్తగూడెం భూవిజ్ఞాన వర్సిటీకి మాస్టర్ ప్లాన్

- మరో 50 ఎకరాల సేకరణ
- ఏడాది వరకు సిబ్బంది విభజన ఉండదు
- విశ్వవిద్యాలయ అభివృద్ధికి సంబంధించి కీలక నిర్ణయాలు




ఈనాడు, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నూతనంగా నెలకొల్పిన డాక్టర్ మన్మోహన్ సింగ్ భూవిజ్ఞాన(ఎర్త్ సైన్సెస్) విశ్వవిద్యాలయానికి మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ప్రభుత్వాలు, ఉపకులపతులు మారినా మాస్టర్ ప్లాన్ ఉంటే ఎక్కడ ఏ విభాగం ఉండాలి.. నిర్మాణాలు, క్రీడా మైదానం, హాస్టళ్లు, ఇతర అభివృద్ధి పనులు ఎలా ఉండాలన్నది నిర్దేశించినట్లవుతుందని, ఫలితంగా ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టవచ్చన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇటీవల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా పాలమూరు విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం... అక్కడ మాస్టర్ ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు ఉండటంతో అదే తరహాలో ఎర్త్ సైన్సెస్ వర్సిటీని కూడా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ప్రస్తుతం వర్సిటీకి 312 ఎకరాల స్థలముంది. పక్కనే మరో 50 ఎకరాలను సేకరించి వర్సిటీకి కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. వచ్చే కొద్ది వారాల్లోనే కొత్తగూడెం కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, నిపుణులు కలిసి మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నారు. ఇటీవల పాల్వంచలో జరిగిన సమావేశంలో వర్సిటీ అభివృద్ధికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

## ముఖ్య నిర్ణయాలు...

- వచ్చే మూడు సంవత్సరాలకు అకడమిక్, హాస్టళ్లు, పరిపాలనా భవనాలు, ఇతర వసతులకు రూ.500 కోట్ల వరకు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇప్పటివరకు మైనింగ్ కళాశాల కాకతీయ వర్సిటీ కింద ఉండటం వల్ల... ఆ నిధుల నుంచి కొంత మొత్తం ఈ వర్సిటీకి కేటాయిస్తారు.
- కొత్తగూడెం కేంద్రంగా సింగరేణి సంస్థ ఉన్నందున ఆ సంస్థ నుంచి ఆర్థిక సహకారం తీసుకుంటారు.
- కేవలం భూ విజ్ఞానానికి సంబంధించిన కోర్సులే కాకుండా విభిన్న కోర్సులతో మల్టీ డిసిప్లినరీ వర్సిటీగా మారుస్తారు. గతంలో సింగరేణి, ఇతర సంస్థల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది కోసం సాయంత్రం ఎంబీఏ కోర్సు నడిచేది. అలాంటి వాటిని అవసరం మేరకు ప్రవేశపెడతారు.
- ఇప్పటివరకు ఇంజినీరింగ్ కళాశాలగా ఇది కాకతీయ వర్సిటీ పరిధిలో ఉండగా... ఇప్పటికిప్పుడు బోధన, బోధనేతర సిబ్బందిని విభజిస్తే సమస్య అవుతుందని భావించారు. అందుకే ఏడాది వరకు కాకతీయ, ఎర్త్ సైన్సెస్ వర్సిటీల మధ్య సిబ్బందిని విభజించరాదని నిర్ణయించారు.
- నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గ్రేడ్ పెంచేందుకు వర్సిటీ ప్రారంభం నుంచే దృష్టి పెడతారు. అందుకు న్యాక్‌లో జాతీయస్థాయి నిపుణుడిగా పేరొందిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ) మేనేజ్‌మెంట్ సీనియర్ ఆచార్యుడి సహకారం తీసుకుంటారు. ప్రస్తుతం ఇక్కడ బీటెక్ రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో పలు కోర్సులున్నాయి. విశ్వవిద్యాలయంలో సైన్స్‌లో డిగ్రీ కోర్సులు ప్రవేశపెట్టడం రాష్ట్రంలో ఇక్కడే ప్రథమం.

## ఈ ఏడాది యూజీ, పీజీలో రెండేసి కోర్సులే

ప్రస్తుత విద్యా సంవత్సరం(2025-26) నాలుగు డిగ్రీ, నాలుగు పీజీ కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించగా... తాజాగా వాటిని కుదించారు. రెండేసి కోర్సులను మాత్రమే ఈ ఏడాది ప్రవేశపెట్టనున్నారు. ఒకేసారి ఎక్కువ కోర్సులైతే వాటిల్లో చేరిన విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం సమస్యగా మారుతుందని భావించి పునరాలోచన చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఈనాడు సోమవారం జులై 28, 2025

# ప్రైవేటు వర్సిటీల్లో అనుమతుల్లేకుండా అగ్రి కోర్సులు

## వ్యవసాయ కార్యదర్శికి వర్సిటీ ఫిర్యాదు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో తమ అనుమతుల్లేకుండా బీఎస్సీ (వ్యవసాయ) కోర్సులను నిర్వహిస్తున్నారని అగ్రి వర్సిటీ రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావుకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ విద్యాసాగర్ లేఖ రాశారు. 'వ్యవసాయ కోర్సులకు అనుమతులపై ఇప్పటికే భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) అన్ని రాష్ట్రాలకు లేఖ రాసింది. దీనికి భిన్నంగా తెలంగాణలోని ప్రైవేటు వర్సిటీలు ఉన్నత విద్యాశాఖ జారీ చేసిన జీవో నం.27 ద్వారా బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సులను ప్రారంభించాయి. వెంటనే ఆ జీవోను సమీక్షించి.. అగ్రివర్సిటీ ఆమోదం లేకుండా కొత్తగా అగ్రి కోర్సులను అనుమతించరాదు. వ్యవసాయ కోర్సులకు అగ్రివర్సిటీ, ఐకార్ అనుమతులు విధిగా పొందాలని ఉత్తర్వులు జారీ చేయాలి. ప్రైవేటు వర్సిటీలు అగ్రి కోర్సులు నిర్వహించకుండా నిరోధించాలి' అని రిజిస్ట్రార్ లేఖలో కోరారు.

ఆంధ్రజ్యోతి హైదరాబాద్ • సోమవారం 28 జూలై 2025

# బీటెక్ బయో టెక్నాలజీలో మరిన్ని సీట్లకు అనుమతి

హైదరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీటెక్‌లో బయో టెక్నాలజీ కోర్సులో మరిన్ని సీట్లకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ కోర్సులో రాష్ట్రవ్యాప్తంగా 330 సీట్లే ఉన్నాయి. ఇందులో 273 సీట్లను కన్వీనర్ కోటాలో కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నారు. సీట్ల సంఖ్య పెంచాలని ఇప్పటికే చాలా మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎంటెక్‌లో బయో టెక్నాలజీ సీట్లు ఎక్కువగా ఉన్నాయని, బీటెక్‌లో మాత్రం తక్కువగా ఉన్నాయని తెలిపారు.